నిర్మాణ పనులు వేగవంతం చేయండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: జిల్లా సమీకృత భవనం (నూతన కలెక్టరేట్) నిర్మాణ పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయని, వేగం పెంచాలని ఆర్అండ్‌బీ ఈఈ, డీఈలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. మండలంలోని అప్పక్‌పల్లి గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలలో గురువారం కలెక్టరేట్ నిర్మాణ పనులు, కళాశాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నిర్మాణ పనులు కొనసాగడం లేదని, పనులను అధికారులు పరిశీలిస్తున్నారా? లేదా అని కలెక్టర్ ప్రశ్నించారు. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. వీటితో పాటు మక్తల్‌లో నిర్మించే వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణం, మద్దూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం ప్రతిపాదన సిద్ధం చేయాలని టీఎస్ ఎంఐడీసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ సౌభాగ్య లక్ష్మి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లికార్జున్, మెడికల్ ప్రిన్సిపల్ డాక్టర్ రాంకిషన్, టీఎస్ ఎంఐడిసి ఈ ఈ జైపాల్ రెడ్డి తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.

హాస్టల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటు

మెడికల్ కళాశాల హాస్టల్ మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉందని ప్రిన్సిపల్ కలెక్టర్‌కు తెలిపారు. కళాశాల ప్రారంభం తర్వాత నిర్వహణకు ఇంకా ఎలాంటి సౌకర్యాలు కల్పించాలని కళాశాల ప్రిన్సిపల్‌ను కలెక్టర్ అడిగారు. ముఖ్యంగా రవాణా సౌకర్యం కోసం బస్సు అవసరమని ప్రిన్సిపల్ కోరగా కలెక్టర్ ఆర్టీసీ ఆర్ఎంతో ఫోన్లో మాట్లాడి బస్ ఏర్పాటు చేయాలని సూచించారు. అయితే ఆర్టీసీ బస్ చార్జీల రూపంలో చాలా డబ్బు చెల్లించాల్సి వస్తుందని ప్రిన్సిపల్‌తో చర్చించిన కలెక్టర్ ఆరోగ్య వాహిని బస్‌ను మెడికల్ కళాశాలకు కేటాయించాలని నిర్ణయించారు.

చిన్న పిల్లల ఆస్పత్రికి వైద్యుడిని తిరిగి రప్పించాలి

జిల్లా కేంద్రంలోని చిన్న పిల్లల ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్యనిపుణుడు క్రాంతి కుమార్ సేవలు చాలా అవసరమని, కానీ ఆయన మద్దూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ అయ్యారని, డిప్యూటేషన్‌పై ఆయనను మళ్లీ చిన్నపిల్లల ఆసుపత్రికి రప్పించాలని ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ కలెక్టర్‌ను కోరగా అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు.

పది మంది పేర్లు ఇస్తే సర్దుబాటు చేస్తా

జిల్లాలో ఉన్న 53 మంది ఎంఎల్‌హెచ్‌పీలలో పదిమంది పేర్లు ఇస్తే మద్దూర్, కోస్గి ఆరోగ్య కేంద్రాలలో వారిని సర్దుబాటు చేస్తానని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి సూచించారు. జిల్లా ఆస్పత్రితో పాటు మద్దూర్, కోస్గి, మక్తల్ ఆస్పత్రులలోనూ మందుల కొరత ఉందని డాక్టర్ మల్లికార్జున్ తెలపగా, తాను మద్దూర్, కోస్గి ఆరోగ్య కేంద్రాలను పరిశీలించిన సమయంలో మందుల కొరత సమస్య తన దృష్టికి వచ్చిందని ఈ నెల 15 వరకు మందులు సరఫరా అయ్యేలా చూస్తానని కలెక్టర్ చెప్పారు. అయితే జిల్లా ఆస్పత్రికి సంబంధించి వంద పడకల వరకే బడ్జెట్ ఉందని, ఇప్పుడు 220పడకల మందులకు బడ్జెట్ అవసరం ఉంటుందని సూపర్డెంట్ మల్లికార్జున్ కలెక్టర్‌కు వివరించగా, స్పందించిన కలెక్టర్ 220 పడకలకు సంబంధించిన మందుల ఇండెంట్ లెటర్ తయారు చేసి ఫైల్ తనకు పంపించాలని సూచించారు. మెడికల్ కళాశాలలో పనిచేసేందుకు అదనంగా మరో 20మంది కార్మికులు అవసరం ఉందని ప్రిన్సిపల్ చెప్పడంతో అందుకు కలెక్టర్ సమ్మతించారు.

క్లుప్తంగా

నేడు టెంకాయల వేలం

కోస్గి: మండల పరిధిలోని ముంగిమళ్ల రామస్వామి ఆలయంలో జరిగే జాతర ఉత్సవాలకు సంబంధించి శుక్రవారం టెంకాయలు, టికెట్ల విక్రయాలకు సంబంధించి వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉదయం 10:గంటలకు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

ముఖద్వార నిర్మాణానికి విరాళం అందజేత



మరికల్: మండలంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ ముఖద్వార నిర్మాణం కోసం దాతలు ముందుకొచ్చి తమవంతు సాయంగా ఆలయ నిర్వహకులకు విరాళం అందజేశారు. గురువారం ఆలయ ఆవరణలో జరిగిన లక్ష బిల్వార్చన సందర్భంగా రూ. 7లక్షల నిధులు అవసరమని ఆలయ కమిటీ సభ్యులు ప్రకటించడంతో లంబడి రాములు రూ.3లక్షలు, నారాయణపేటకు చెందిన లింకిరఘు రూ. 25 వేలు, ఇతర దాతలు తమవంతు సహకారం అందజేస్తామని హామీచ్చారు. అనంతరం ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, పీఠాధిపతుల సమక్షంలో విరాళాలను అందజేశారు. జగదీష్, శివకుమార్, వీరన్న, సూర్యమోహన్, బసంత్, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

కోస్గి: కమిట్ మెంట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన కామినేని ఆస్పత్రి వారి సహకారంతో గురువారం స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఉచితంగా ఎముకలకు సంబంధించి 230మందికి ఆర్థో పరీక్షలు చేశారు. వీరిలో అవసరమైన వారికి ఉచిత మందులు అందజేసి, మరికొందరికి ఫిజియోథెరపి చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య బృందం, కమిట్ మెంట్స్ ఈడీ జాన్సీ రాణి, కో-ఆర్డినేటర్స్ దస్తయ్య, రాధమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి



కోస్గి: ప్రతియేటా శ్రావణ మాసం చివరి శనివారం జరిగే పాతర్లగడ్డ ఆంజనేయస్వామి జాతరకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతూ గురువారం యువకులు మున్సిపల్ కమిషనర్ శశిధర్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ పరిధిలో జరిగే ఈ జాతరకు ప్రధాన రోడ్డు నుంచి విద్యుత్ దీపాలు ఏర్పాటుచేయాలని, జాతర ప్రాంగణంలో బురద లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. బీజేపీ నాయకులు సంపల్లి శ్రీనివాస్, తిమ్మాయపల్లి మల్లేష్‌తో పాటు పలువురు యువకులు ఉన్నారు.

మద్దూరులో దంచికొట్టిన వర్షం



మద్దూరు: పట్టణంలో గురువారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. దాదాపు అరగంటపాటు వర్షం పడింది. మద్దూరులో సాయంత్ర 6గంటల వరకు 9.3 ఎంఎం, కొత్తపల్లి మండలంలో 15.3 ఎంఎం వర్షం పడినట్లు ఏఎస్ఓ శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని గురువారం సంతకావడంతో వర్షానికి రోడ్డుపై నీరు పారుతుండంతో కురగాయాలు వర్షానికి కొట్టుకుపోయాయి. వాటిని సంతకు వచ్చిన వారు తీసుకునే పనిలో పడ్డారు.

పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం

మద్దూరు: మండలంలోని రెనివట్ల ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు అక్షరాలు అయిన అ, ఆ అక్షరాలతో విద్యార్థులను కూర్చోబెట్టి తెలుగు భాషా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా కవి, తెలుగు భాష పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు బాల్‌రాజ్, సతీష్, బ్రహ్మయ్య, సాయికుమార్, రాజేష్, రాజశేఖర్, నర్సింహులు పాల్గొన్నారు.



పెట్టుబడి సాయాన్ని వినియోగించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

ధన్వాద: పెట్టుబడి సాయం పథకాన్ని దళిత రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కిష్టాపూర్‌లో దళిత మహిళలకు పెట్టుబడి సాయం కింద దాదాపు 45మంది దళిత రైతులకు ఒక్కొక్కరికీ రూ.36,676 చొప్పున 16లక్షల 64,400 చెక్కులను పంపిణీ చేశారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ.. తాను నాయకురాలు కాదని ప్రజా సమస్యలు విని వాటిని పరిష్కరించే ప్రజా సేవకురాలినని వివరించారు. కిష్టాపూర్ గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గ్రామ సమస్యలన్నింటిని దశలవారీగా పరిష్కరిస్తానన్నారు. స్థానిక నాయకులు మీ సమస్యలు పట్టించుకోకుండా ఉంటే తాను అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఖలీల్‌సాబ్, పేట మున్సిపల్ చైర్మన్ గందె అనసూయ, ఎంపీడీఓ సాయి ప్రకాష్, తాసీల్దార్ సింధుజా, టీఎన్జీఓ మాజీ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, సిగిల్‌విండో ఉపాధ్యక్షుడు గండిబాలరాజు, మాజీ సర్పంచ్ దామోదర్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, నిరంజన్‌రెడ్డి, సుర్యమోహన్, ఆంజనేయులు, గోపాల్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్‌ఓసీ అందజేత

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని హాజీఖాన్‌పేట కుర్వగేరికి చెందిన కుర్వ లింగప్పకు గురువారం సీవీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు. బాధితుడు గతకొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై కాలు విరిగిపోవడంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందగా, ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో బాధితుడు ప్రభుత్వం పరంగా తనను ఆదుకోవాలని ఎమ్మెల్యేను కోరగా సీఎం సహాయనిధి నుంచి రూ. 75వేలు మంజూరు చేయించారు. అందుకు సంబంధించిన ఎల్‌ఓసీని బాధితుడికి ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యేతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, నాయకులు బండి వేణుగోపాల్, కౌన్సిలర్లు సలీం, మహేశ్, మాజీ కౌన్సిలర్లు వినోద్, మారుతి, రమేష్ ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఊట్కూరు: వర్షాకాలంలో ఇంటి పరిసరాలలో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ అన్నారు. గురువారం మండలంలోని ముగ్దుంపూర్ రహదారి పక్కన మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. మొక్కల చుట్టు కంచె ఏర్పాటు చేయాలని, మొక్కలు ఎండిన స్థానంలో కొత్త మొక్కలు నాటాలని ఉపాధి కూలీలకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలోని ఖాళీ స్థలాలలో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ సత్యప్రకాష్, రాము, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విగ్రహావిష్కరణ



మక్తల్: పట్టణంలోని దండు క్రాసింగ్ వద్ద బసవేశ్వర విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, మండల అధ్యక్షుడు దొడ్డప్ప గురువారం తెలిపారు. గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు.. నేరడు గోమ్ పీఠాధిపతి సిద్ధలింగేశ్వరస్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఉదయం 11:30 గంటలకు విగ్రహా విష్కరణ ఉంటుందని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జహిరాబాద్ ఎంపీ సురేష్ శెట్కర్, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పావని, వైస్‌చైర్మన్ అఖిలరెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో లింగాయత్ పరిషత్ గౌరవ అధ్యక్షుడు దూది బస్వరాజ్, వీరేశం, కర్ని జగదీష్, గణేష్‌కుమార్, రాకేష్, క్రాంతికుమార్, సురేష్, దయానంద్, బస్వరాజ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మీదితండాలో అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ

నారాయణపేట రూరల్: ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్ఐ అంజిలయ్య అన్నారు. మండలంలోని మిదితండాలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, అంటరానితనం, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, షీ టీం, ట్రాఫిక్ చట్టాలు, సీసీ కెమెరాలపై మాటల ద్వారా పాటల రూపంలో వివరించారు. అనంతరం ఏఎస్ఐ మాట్లాడుతూ.. ప్రజలు మత్తు పదార్థాలైన డ్రగ్స్ గంజాయి, గుట్కా, మద్యపానానికి దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు సేవించడంతో అనారోగ్య కారణాల పాలవుతారని మరియు ఆర్థికంగా కుటుంబాలు దెబ్బతింటాయన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్కి లేదా డయల్ 100కి కాల్చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, కల్యాణి, రుక్యానాయక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

నర్వ: త్వరలో జరగబోయే వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ కురుమయ్య అన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులనుద్దేశించి మాట్లాడారు.. నవరాత్రి ఉత్సవాలలో మండపాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్‌లకు సహకరించాలన్నారు. వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఇబ్బంది కలిగించే సౌండ్స్ చేసే డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా శబ్దాలను మండపాల వద్ద ఏర్పాటు చేయొద్దన్నారు. పోలీస్‌ల అనుమతి తప్పనిసరి తీసుకోవాలన్నారు. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకున్న వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది ఆంజనేయులు, శంకర్, రాజురెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి

ఊట్కూరు: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ భవాని కోరారు. మండలంలోని మల్లెపల్లిలో రెండు రోజుల క్రితం డెంగీ కేసు నమోదు కావడంతో ఈ విషయం తెలుసుకున్న వైద్యసిబ్బంది బాధితుల ఇంటింటికి వెళ్లి రక్త నమూనాలను సేకరించి సర్వే చేపట్టారు. అనంతరం 52 ఇండ్లలో దోమల నివారణకు పిచికారి చేశారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ.. దోమలతో విషపు జ్వరాలు వస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇంటి చుట్టూ పక్కల మురుగునీరు గుంతలు ఉంటే పూడ్చి వేయాలని, రాత్రి వేలలో దోమతెరలు కట్టుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ్‌కుమార్, మహేశ్వరి, సుశ్మిత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దోమల నివారణకు పిచికారీ చేస్తున్న వైద్యసిబ్బంది

ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



నారాయణపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



మక్తల్‌లో ..



కోస్గిలో..



మరికల్‌లో..

నారాయణపేట రూరల్: పట్టణం, మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వివిధ పాఠశాలలో క్రీడలపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలతోపాటు ఇండోర్, అవుట్ డోర్ క్రీడలను ఏర్పాటుచేశారు. అంతకుముందు పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి, విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అలాగే అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారిణి హరిక దేవిని సన్మానించారు. ఆయా కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్స్, వ్యాయామ ఉపాధ్యాయులు, టీచర్లు, పీడీ అక్తర్ పాషా, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

మక్తల్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని గురువారం పాఠశాల విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. అంతకుముందు స్థానిక మినీస్టేడియంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి క్రీడా జ్యోతిని వెలిగించి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆయన మాట్లాడుతూ.. ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని క్రీడలలో రాణించాలన్నారు. ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. అదేవిదంగా మండలంలోని కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా జ్యోతిని జీహెచ్ఎం వెంకటయ్య చేతుల మీదుగా ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో పీడీ రూప, దామోదర్, అంబ్రేష్, వెంకటేష్, మంజుల, ఎల్లప్ప, నరేష్, నర్సప్ప, ప్రియాంక, మీరా, శిరిష, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. పాఠశాల ఆవరణలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. క్రీడాకారుడిగా దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎం కృష్ణగౌడ్‌తోపాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరికల్: జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా మండలంలోని కస్తుర్బాగాంధీ పాఠశాల విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. వివిధ క్రీడా పోటీలను నిర్వహించుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాలలో నిర్వహించే ప్రతి క్రీడలో పాల్గొని రాణించాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురష్కరించుకొని ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రాకేష్‌శర్మను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలో వివిధ పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. ఈ మేరకు.. క్రీడాకారులు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కాగడాతో గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. చిన్నపొర్ల పాఠశాలలో క్రీడాకారులు డ్రాయింగ్ టీచర్, పీఈటీ టీచర్లను శాలువాతో సన్మానించారు. ఇన్‌చార్జి హెచ్ఎం మురళీధర్, పీడీ సాయినాథ్, పారిజాత, లయన్స్‌క్లబ్ సభ్యులు వై జనార్దన్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, నర్సింహారాజుగౌడ్, రమేష్‌బాబు, దొబ్బలి హన్మంతు పాల్గొన్నారు.

ధన్వాడ: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని గురువారం మండలంలోని కొండాపూర్‌లో గిరిజన గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. విద్యార్థులకు నెట్‌బాల్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ రాజారాం మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిచదువుతోపాటు క్రీడలు ముఖ్యమని పోటీల్లో గెలుపొంది జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావాలన్నారు. అలాగే స్థానిక కస్తుర్బాగాంధీ పాఠశాల విద్యార్థులు క్రీడా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వాహించారు. ఆయా కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం, ఉట్కూర్ నెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు రమేష్‌శెట్టి, వైస్ ప్రిన్సిపల్ సురేష్‌రావు, సాంబయ్యానాయక్, డాక్టర్ రామ్మోహన్‌గౌడ్, సుగుణాకర్ పాల్గొన్నారు.

కృష్ణా: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని గురువారం మండలంలోని కున్సి ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ధ్యాన్‌చంధ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సంతోషి, ఉపాధ్యాయులు నర్సప్ప, నరేందర్, ఆలీ, రమేష్, ఉష, పీడీ సౌమ్య, మారెప్ప, రియాజ్ పాల్గొన్నారు.

మద్దూరు: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు పాఠశాల ఆవరణలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీడీ వెంకటప్ప, పాఠశాల ఉపాధ్యాయులు సరిత, బాలాజీ, రఘు, యశ్వంత్, నాగేందర్, భీమయ్య, సుధాకర్, బందెప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



మాట్లాడుతున్న కాంప్లెక్స్ హెచ్ఎం గణేష్‌సింగ్

కృష్ణా: మండల పరిధిలోని ముడుమాల్ ప్రాథమిక పాఠశాలను గురువారం కాంప్లెక్స్ హెచ్ఎం గణేష్ సింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చేవిధంగా ఉపాధ్యాయులు చూడాలని, వారికి అర్థం అయ్యేలా బోధించాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం నిర్వాహకులకు భోజనం నాణ్యతగా ఉండాలని తగిన సూచనలు చేశారు. పాఠశాల హెచ్ఎండి శేఖర్, ఉపాధ్యాయులు రమణ, రాధరాణి, లక్ష్మినారాయణ, మహేశ్వరి, సీఆర్‌పీ రమేష్ ఉన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి



పేటలో మాట్లాడుతున్న నామాజీ

నారాయణపేట రూరల్/ధన్వాడ: గ్రామ స్థాయిలో బీజేపీ పటిష్టంగా ఉండేలా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, వచ్చే పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగురావు నామాజీ అన్నారు. గురువారం పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. వచ్చే స్థానిక ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ గెలుపుపొందే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. అలాగే మండలంలోని సభ్యత్వనమోదును ఒక పండుగలా నిర్వహించి, అందరని ఆకట్టుకోవాలని బీజేపీ జిల్లా సభ్యత్వ నమోదు కో కన్వీనర్ కెంచె శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రఘువీర్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం మండల పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.. ఆయా కార్యక్రమాల్లో రాము, కో -కన్వీనర్ కెంచె శ్రీనివాసులు, మిర్చి వెంకటయ్య, సత్యనారాయణ, పాండు, సత్యరఘుపాల్ రెడ్డి, పోషల్ వినోద్, గోపాల్ యాదవ్, మండల బీజేపీ అధ్యక్షుడు సాయిబన్న, గణప శ్రీనివాస్, బాల్‌రెడ్డి, నాగిరెడ్డి, వై.నారాయణ రెడ్డి, కొంగారి రాములు పాల్గొన్నారు.

అదేవిధంగా ధన్వాడలో గురువారం సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో బీజేపీ కార్యకర్తలు ఉండేలా సభ్యత్వాలు చేయించాలని సూచించారు. మండల అధ్యక్షుడు మాకం సురేందర్, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, ఉదయభాను, రాంచంద్రయ్య, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మల్లయ్య, శివరాజ్, రాఘవేందర్ పాల్గొన్నారు.

మరికల్: నూతన సభ్యత్వాల నమోదు ప్రక్రియను ప్రారంభిస్తున్నామని మండల అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి అన్నారు. మండలంలోని నంది ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ఉంటుందన్నారు. ఇందకు గాను మండల బూత్‌స్థాయి అధ్యక్షులు, మండలంలోని వివిధ మోర్చాల అధ్యక్షులు పాల్గొనాలన్నారు.

దేశం కోసం పనిచేసేది బీజేపీ..

నర్వ: కార్యకర్తలు దేశంకోసం, ధర్మం కోసం పనిచేసే ఏకైక పార్టీ బీజేపీ అని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం తన ఫాంహౌస్‌లో నిర్వహించిన మండల బూత్‌స్థాయి సభ్యత్వ నమోదులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.. ప్రతి కార్యకర్త కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజలకు చేరవేసి సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. మండల సభ్యత్వ నమోదు కన్వీనర్ ఉందేకోడ్ జగన్నాథం, సంజీవ్, నర్సింహులు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వావిళ్ల రవికుమార్, మండల నాయకులు కృష్ణయ్య, బీసం రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్

కోస్గి: తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే చదువుతోపాటు హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను నేర్పించాల్సిన అవసరం ఎంతైన ఉందని వీహెచ్‌పీ పాలమూరు జిల్లా ప్రాంత ఉపాధ్యక్షుడు జగదీష్ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక లక్ష్మీ నర్సింహా గార్డెన్స్‌లో జరిగిన సంఘం కోస్గి ప్రఖండ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. మనం, మన కుటుంబం అంటూ మన వరకే పరిమితం కాకుండా, హైందవ సమాజం, మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుందామనే భావన ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. నేటి బాలలే రేపటి బావిభారత సమాజ నిర్మాతలని అన్నారు. ప్రధానంగా తల్లులు తమ పిల్లలకు బడి, గుడి అలవాట్లను చిన్నతనం నుంచే నేర్పాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, కార్యదర్శి లక్ష్మీనారాయణ, నరేంద్ర, కోస్గి శాఖ అధ్యక్షుడు వెంకట్రాములు, అంజిలయ్య, మల్లప్ప, రాజేందర్ పాల్గొన్నారు.

టీచర్లకు జేఎల్ పదోన్నతి కల్పించండి



పాఠశాలలో సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: సీనియర్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి కల్పించాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యాద్గిర్ జనార్దన్ రెడ్డి కోరారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఆ సంఘం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ మేరకు.. ఉపాధ్యాయునుద్దేశించి మాట్లాడుతూ.. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించేందుకు సీఎం చొరవ చూపించడం ఆనందంగా ఉందన్నారు. త్వరలోనే పర్యవేక్షణ అధికారులైన ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేస్తారని, ఏడీ, జేఎల్ పదోన్నతులు జరుగుతాయన్నారు. ఉపాధ్యాయ సమస్యలు తమ సంఘంతోనే సాధ్యమవుతుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ, పంచాయతీరాజ్, అన్ని యాజమాన్య గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు జరిగే విధంగా సంఘం కృషి చేసిందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రఘువీర్, మొల్గన్ జనార్దన్, వాణిశ్రీ, జహీరోద్దీన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

నారాయణపేట రూరల్: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా వైభవంగా జరిగే లోకాయపల్లి లక్ష్మమ్మ జాతర ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు ముస్తాబుచేశారు. జిల్లా కేంద్రంతో పాటు, వివిధ గ్రామాలు, కర్ణాటక వాసులు హాజరయ్యే ఈ వేడుకకు అన్నిఏర్పాట్లు చేశారు. స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు. దీంతో ఎలాంటి ట్రాఫిక్, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లను గురువారం రాత్రి సీఐ శివ శంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు.అదేవిధంగా ఆలయ కమిటీ పెద్దలతో సమావేశమై క్యూలైన్స్‌కి బ్యారికేట్స్ ఏర్పాటు చేయాలని, పార్కింగ్‌కు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరారు.